క్లుప్తంగా

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

కోవెలకుంట్ల: రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ శుక్రవారం కోవెలకుంట్ల రోటరీక్లబ్ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా నాయకుడు సుధాకర్ తెలిపారు. పెరిగిన విద్యుత్ చార్జీలు, స్మార్ట్‌మీటర్లు, సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని కోరుతూ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలోని ఆయా ప్రజాసంఘాలు, వివిధ పార్టీల నాయకులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎం

బేతంచెర్ల: ఎక్కడ విధులు నిర్వహించినా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించి ఉత్తమ ఉపాధ్యాయులుగా పేరు తెచ్చుకోవాలని ఎంఈఓ సోమశేఖర్ అన్నారు. మండల పరిధిలోని గోర్లగుట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు శివ కుమారస్వామి, వరలక్ష్మి, మారుతిదేవి, మురళీలను గురువారం ఘనంగా సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి, హెచ్‌ఎం మద్దిలేటి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్షం రాకతో చిగురిస్తున్న ఆశలు

కొలిమిగుండ్ల: ఖరీఫ్ సీజన్ మొదలై దాదాపు రెండు నెలలు కావస్తున్నా చినుకు జాడలేక దిగాలుగా ఉన్న రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గురువారం కొలిమిగుండ్ల మండలంలో 30 సెం.మీ వర్షపాతం నమోదైంది. దీంతో వివిధ రకాల పంటలు సాగు చేసేందుకు పొలాలు దుక్కిదున్నుకున్న రైతులు విత్తనాలు వేసుకోవచ్చనే ఆలోచనలో ఉన్నారు. ఇప్పటికే మొక్కజొన్న, మినుము, పత్తి తదితర పంటలు సాగులో ఉండడంతో వర్షాలు లేక వాడుముఖం పడుతున్నాయి. తెల్లవారుజామున కురిసిన వాన పంటలకు కాస్త ఊపిరినిచ్చింది. కొన్ని గ్రామాల్లో తేలికపాటి, మరికొన్ని గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. అయితే భారీ వర్షపాతం కోసం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో వ్యవసాయ బోర్లలో గంగమ్మ పాతాళానికి చేరుకుంది.

మహా సంప్రోక్షణ ఏర్పాట్ల పరిశీలన



రామ్‌కో ప్రతినిధులతో చర్చిస్తున్న సీఐ

కొలిమిగుండ్ల: స్థానిక కొండపై వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు మహా సంప్రోక్షణ, కుంభాభిషేక మహోత్సవాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. గురువారం సాయంత్రం రామ్‌కో సిమెంట్ కంపెనీ ప్రతినిధులతో కలిసి సీఐ రమేష్‌బాబు ఆలయ పరిసరాలను పరిశీలించి ఏర్పాట్లపై చర్చించారు. చివరి రోజు జరిగే కార్యక్రమంలో ప్రముఖులతో పాటు భక్తులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉండడంతో వాహనాల పార్కింగ్, అన్నదానం తదితర ఏర్పాట్లపై ఆరా తీశారు. ఎక్కడా ఇబ్బందులు ఏర్పడకుండా జాగ్రత్తలు పాటించాలని రామ్‌కో ప్రతినిధులకు సీఐ సూచించారు.

మహాసభలను విజయవంతం చేద్దాం



కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

బేతంచెర్ల: డోన్‌లో ఈనెల 30, 31 తేదీల్లో జరగనున్న సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి భార్గవ్ కోరారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. పార్టీ నేతలతో పాటు విద్యార్థి, ప్రజా, కార్మిక, రైతు సంఘాల సభ్యులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ పాల్గొన్నారు.

ఐదుగురు మందుబాబులపై కేసు

కోవెలకుంట్ల: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని కోవెలకుంట్ల ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. పట్టణ శివారులోని వివిధ ప్రాంతాల్లో గురువారం బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. అలాగే స్థానిక ముదిగేడు చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆళ్లగడ్డ, నంద్యాల, బనగానపల్లె, అవుకు, తదితర ప్రాంతాలవైపు వెళ్లే వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్, హెల్మెట్, తదితర రికార్డులు లేని వాహన చోదకులకు జరిమానా విధించారు.

సదరం..జాప్యం

- సర్టిఫికెట్ల జారీలో అలసత్వం
- ఆందోళనలో దివ్యాంగులు

కొలిమిగుండ్ల: సదరం సర్టిఫికెట్ అనేది దివ్యాంగుల వైకల్య స్థాయిని గుర్తించేది. ఈ సర్టిఫికెట్ ద్వారా వారికి ప్రభుత్వాల నుంచి పింఛన్, రాయితీలు, ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో రిజర్వేషన్లు పొందేందుకు ఉపయోగపడుతుంది. శారీరక వైకల్యం, మానసిక స్థితి సరిగా లేకపోవడం, దృష్టి లోపంతో బాధపడేవారికి వైకల్యాన్ని నిర్ధారిస్తూ సదరం సర్టిఫికెట్ అందిస్తుంటారు. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారు. బనగానపల్లె నియోజకవర్గంలోని దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ల కోసం గ్రామ సచివాలయాల్లో స్లాట్ బుక్ చేసుకొని నంద్యాల, బనగానపల్లె ప్రభుత్వ ఆస్పత్రుల్లో హాజరయ్యారు. నెలలు గడిచినా కూటమి ప్రభుత్వం సదరం సర్టిఫికెట్లు మంజూరు చేయడం లేదని దివ్యాంగులు మండిపడుతున్నారు. ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. సాధారణంగా స్లాట్ బుక్ చేసుకుని ఆస్పత్రుల్లో చెకప్ అయ్యాక పది రోజుల నుంచి మూడు వారాల వ్యవధిలో అధికారులు ఓకే చేస్తే దివ్యాంగులు ప్రింట్ తీసుకునేవారు. కానీ నెలలు గడుస్తున్నా ఒక్కరికి కూడా విడుదల చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. నడవలేని స్థితిలో ఉన్న చాలా మంది దివ్యాంగులు తమ కుటుంబ సభ్యుల సాయంతో ఆస్పత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకున్నారు. రీవెరిఫికేషన్ కోసం పోయిన దివ్యాంగులకు కొత్తగా సదరం సర్టిఫికెట్లు ఇవ్వాల్సి ఉన్నా వారికి అందలేదు. బనగానపల్లె నియోజకవర్గంలోని 5 మండలాల్లో వివిధ రకాల దివ్యాంగుల పింఛన్ తీసుకునే వారి సంఖ్య7వేల మంది మేర ఉంటారు.

కొత్త పింఛన్ ఒక్కటీ లేదు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా దివ్యాంగులకు ఒక్క కొత్త పింఛన్ మంజూరు చేయలేదు. రూ.3వేలు ఉన్న పింఛన్ సొమ్మును రూ.6 వేలకు పెంచామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. ఏడాది నుంచి అర్హులైన దివ్యాంగులు పింఛన్‌ల కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. గ్రామ సచివాలయాల్లో పింఛన్‌లకు చెందిన వెబ్‌సైట్ ఒక్క రోజూ తెరుచుకోని పరిస్థితి నెలకొంది. నియోజకవర్గ వ్యాప్తంగా 600 మందికి పైగానే ఉన్నట్లు తెలుస్తోంది. కొత్త పింఛన్‌లు ఇస్తారా లేదో తెలియని సందిగ్ధం నెలకొంది. పర్మినెంట్ సదరం సర్టిఫికెట్ ఉంటేనే పింఛన్ దరఖాస్తు చేసుకోవడానికి అర్హత ఉంటుంది. సర్టిఫికెట్లు రాక, పింఛన్ వెబ్‌సైట్ తెరుచుకోకపోవడంతో దివ్యాంగులు పడరాని పాట్లు పడుతున్నారు.



రీవెరిఫికేషన్‌కు హాజరైన దివ్యాంగులు(ఫైల్)

రీవెరిఫికేషన్‌తో ఆందోళన

కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్‌లపై కుట్ర పన్నిందని ఆరోపిస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి పింఛన్ తీసుకునేవాళ్లను సైతం రీవెరిఫికేషన్ చేయించడంతో పింఛన్‌లు ఉంటాయో తొలగిస్తారోనన్న ఆందోళన లబ్ధిదారుల్లో నెలకొంది. ఆరు నెలల నుంచి వీరికి చెందిన పింఛన్‌లపై ఆస్పత్రుల్లో రీవెరిఫికేషన్ చేస్తున్నారు. రూ.6 వేలు ఇస్తుండడంతో లబ్ధిదారుల సంఖ్య కుదించేందుకే సర్కారు కొత్త కుట్రకు తెరలేపుతోందనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మంచానికి పరిమితమైన వారికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.10 వేలు ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వారికి రూ.15వేలు చొప్పున 2024 ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు ఇచ్చారు. 2025 జనవరి నుంచి రీవెరిఫికేషన్ చేపట్టడంతో రూ.15వేలు ఇవ్వడం నిలుపుదల చేశారు.

సర్టిఫికెట్ కోసం ఎదురుచూస్తున్నా



నాకు అంధత్వ సమస్య 70 శాతం మేర ఉంది. రెండు నెలల కిందట రీవెరిఫికేషన్ కోసం నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి పరీక్ష చేయించుకున్నాను. ఇంత వరకు సదరం సర్టిఫికెట్ అందలేదు. ఎప్పుడు విడుదల చేస్తారో అని ఎదురుచూస్తున్నా. పింఛన్లలో కోత విధించేందుకు వెరిఫికేషన్ చేస్తున్నారనే భయం దివ్యాంగుల్లో ఉంది.

–రంగయ్య, కమ్మవారిపల్లె

సర్టిఫికెట్ల మంజూరులో నిర్లక్ష్యం



దివ్యాంగుల సదరం సర్టిఫికెట్ల జారీలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పింఛన్‌కు అర్హత ఉన్న దివ్యాంగులు అష్టకష్టాలు పడి సుదూరంగా ఉన్న ఆస్పత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకున్నారు. రీవెరిఫికేషన్ చేయించుకున్న వారి పరిస్థితి ఇలాగే ఉంది. మూడు వారాల్లోనే సర్టిఫికెట్లు ఇచ్చేవాళ్లు. ప్రభుత్వం స్పందించి సర్టిఫికెట్లు మంజూరు చేసి కొత్త పింఛన్‌ల దరఖాస్తుకు అవకాశం కల్పించాలి.

–దేవరాజు,దివ్యాంగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు

ఆర్థికపరమైన సమస్యలను పరిష్కరించాలి



సబ్‌ట్రెజరీ అధికారికి అభినందనలు తెలియజేస్తున్న ఉద్యోగులు

డోన్ టౌన్: ఉద్యోగులకు రావాల్సిన ఆర్థికపరమైన బిల్లులు, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి సహకరించాలని ఏపీ ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి సునీల్ కోరారు. గురువారం డోన్ నూతన సబ్ ట్రెజరీ అధికారి సుధీర్‌కుమార్‌ను ఉద్యోగుల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. సంఘం కోశాధికారి లక్ష్మణ్ నాయక్, సీడీపీఓ శంషాద్‌బేగం, ఉద్యోగులు కృష్ణకుమార్, వెంకటేశ్వర్లు, తిప్పమ్మ, రాజేశ్వరి, అరుణకుమారి, రాధమ్మ, కృష్ణ తదితరులు ఉన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్ విఫలం

డోన్ టౌన్: రాష్ట్రంలో ప్రజల సమస్యలను పరిష్కరించడంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఘోరంగా విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. ఎద్దుపెంట గ్రామంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమల్లో కూటమి సర్కార్ విఫలమైందన్నారు. ప్రజా సమస్యలపై తమ పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. పార్టీ మండల కార్యదర్శి నారాయణ, పులిశేఖర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

'బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ' ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బీవీ నాగార్జునరెడ్డి

కోవెలకుంట్ల: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ కోవెలకుంట్లలో నిర్వహించ తలపెట్టిన 'బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బీవీ నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగిస్తున్నారన్నారు. సూపర్‌సిక్స్ హామీలతో పాటు ఇతర హామీలు అమలు చేస్తారని నమ్మి ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క హామీ నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కూటమి పాలనలో కప్పం కట్టనిదే ఇసుక అందడం లేదని తెలిపారు. ఆదివారం పట్టణంలోని ముదిగేడు చౌరస్తాలోని లక్ష్మి వెంకటేశ్వర ఫంక్షన్ హాలులో బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీ ప్రజా ప్రతినిధులు, అనుబంధ విభాగాల కన్వీనర్లు, సభ్యులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసనాయక్, ఏపీఎన్‌జీఓ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గువ్వల రామకృష్ణారెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, దశరథరామిరెడ్డి పాల్గొన్నారు.

రేపు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

కొలిమిగుండ్ల: స్థానిక పార్టీ కార్యాలయంలో ఈనెల 19న సాయంత్రం వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి గురువారం తెలిపారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీవైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరవుతారని చెప్పారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, అనుబంధ సంఘాల కన్వీనర్లు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మెడికల్ క్యాంపులు ప్రజలకు ఉపయోగం



మందులు అందిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

కొలిమిగుండ్ల: రామ్‌కో సిమెంట్ కంపెనీ సీఎస్‌ఆర్ కింద చుట్టు పక్కల గ్రామాల్లో ప్రతి నెలా మెడికల్ క్యాంపులు నిర్వహించడం వల్ల ప్రజలకు చాలా ఉపయోగపడుతోందని తహసీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం కల్వటాలలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును ఆయన పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. కంపెనీ అందించిన మందులను పంపిణీ చేశారు. గ్రామాల్లో క్రమం తప్పకుండా క్యాంపులు నిర్వహించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కంపెనీ ప్రతినిధులకు సూచించారు. వీఆర్వో ప్రసాదరెడ్డి, రామ్‌కో ప్రతినిధులు పాల్గొన్నారు.

పాణ్యం జూనియర్ కళాశాలకు కొత్త భవనం

- ప్రారంభించిన పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



పాణ్యం సిమెంట్ జూనియర్ కళాశాల నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న కాటసాని, ఎంపీపీ

బేతంచెర్ల టౌన్: తల్లిదండ్రులు, గురువులు, పెద్దలను గౌరవించే మన తెలుగు సంస్కృతిని నేటి తరాలు అలవర్చుకోవాలని పాణ్యం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. గురువారం పాణ్యం సిమెంట్ జూనియర్ కళాశాల నూతన భవనాన్ని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, గిడ్డంగుల శాఖ మాజీ డైరెక్టర్ బాబుల్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఆయనకు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ..39 ఏళ్ల క్రితం స్థాపితమైన ఈ కళాశాల ఎంతో మంది విద్యార్థులకు వెలుగునిచ్చిందని తెలిపారు. ఎంత ఎదిగినా తల్లిదండ్రులు, తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను మరవకూడదని సూచించారు. ఎంపీపీ నాగభూషణం రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రతినిధి మురళీకృష్ణ మాట్లాడుతూ..పాణ్యం కళాశాల పూర్వ విద్యార్థులుగా గర్వపడుతున్నామన్నారు. కళాశాల అభివృద్ధికి కాటసాని రాంభూపాల్ రెడ్డి చేసిన సేవలను ప్రిన్సిపాల్ వేణుగోపాల్ శర్మ, అధ్యాపకుడు శ్రీనివాసులు ప్రశంసించారు. అనంతరం డీఐఈఓ శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాణ్యం కళాశాలను పరీక్ష కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కళాశాల అభివృద్ధికి తనవంతు సహాయంగా రూ.10 వేల విరాళాన్ని అందించారు. కార్యక్రమంలో కళాశాల అడ్వైజర్ భూపాల్ రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు రుద్రవరం నారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు సూర్య బళ్లాని, మధు, మనోహర్, ఎర్రగుంట్ల రాజు, కటారు కొండ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ దాడులు





కోవెలకుంట్లలోని ఓ దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు, బేతంచెర్లలో తనిఖీలు

కోవెలకుంట్ల: పట్టణంలోని రసాయన ఎరువుల దుకాణాల్లో గురువారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. యూరియా, ఎరువుల కొరత ఉన్న నేపథ్యంలో విజిలెన్స్ ఏడీఏ నరసింహారెడ్డి, ఎస్‌ఐ రమణప్ప, కోవెలకుంట్ల ఏడీఏ సుధాకర్, ఏఓ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫెర్టిలైజర్స్ షాపులను పరిశీలించారు.ఎరువుల స్టాక్ రిజిస్టర్లు, అందుబాటులో ఉన్న స్టాక్ వివరాలను తనిఖీ చేశారు. వివిధ రసాయన ఎరువులకు సంబంధించి సరైన రికార్డులు లేకపోవడంతో రూ. 4.65 లక్షల విలువ చేసే ఎరువులను సీజ్ చేశారు.

నిబంధనలకు విరుద్ధంగావిక్రయాలు జరిపితే చర్యలు

బేతంచెర్ల: ఫర్టిలైజర్ దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరిపితే చర్యలు తప్పవని గుంటూరు కమిషనరేట్ ఏడీఏ ప్రసాద్, విజిలెన్స్ సీఐ శ్రీనివాసులు అన్నారు. గురువారం పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేస్తే తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని స్పష్టం చేశారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. డోన్ ఏడీఏ సునీత, బేతంచెర్ల ఏఓ విజయ కుమార్ రెడ్డి ఉన్నారు.

ఎక్కడపడితే అక్కడ చికెన్ వ్యర్థాలను పడేయొద్దు



చికెన్ సెంటర్ నిర్వాహకుడికి నోటీసు ఇస్తున్న పీఎస్

బేతంచెర్ల: మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో ఎక్కడ పడితే అక్కడ చికెన్ వ్యర్థాలు పడేస్తే చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పలువురు చికెన్ దుకాణ నిర్వాహకులకు నోటీసులు అందజేశారు. చికెన్, మటన్, చేపల వ్యర్థాలను వ్యాపారులు ఎక్కడపడితే అక్కడ పడేయడం వల్ల కుక్కలు, పందుల బెడద ఎక్కువయ్యాయని తెలిపారు. వాటి వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వ్యాపారులు పంచాయతీ వాహనంలోనే వ్యర్థాలు పడేయాలని స్పష్టం చేశారు. లేకుంటే ప్రజారోగ్యచట్టం 1965 ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. పరిశుభ్రత, ప్రజారోగ్యానికి సహకరించాలన్నారు.

రోడ్లు నిర్మించాలని వినూత్న నిరసన



రోడ్డుపై చేరిన నీటిలో చేపలు పట్టేలా నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

డోన్ టౌన్: పట్టణంలో సీసీరోడ్లు, కాలువలు నిర్మించాలని కోరుతూ గురువారం సీపీఎం నాయకులు వినూత్న నిరసన చేపట్టారు. కోట్ల నగర్, వైఎస్ నగర్ రోడ్లపై నిల్వ ఉన్న వర్షపు నీటిలో చేపలు పడు తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, ఐద్వా నాయకులు షమీమ్ బేగం, షరీనా మాట్లాడుతూ.. డోన్ మున్సిపాలిటీగా ఏర్పడి 20 ఏళ్లు గడిచినా అనేక వార్డుల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు లేకపోవడం వల్ల కొద్దిపాటి వర్షం కురిసినా రోడ్లన్నీ చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయని ఆరోపించారు. పార్టీ నాయకులు రాజు, సుంకన్న, లక్ష్మీదేవి, హుస్సేన్‌బీ, నాగేంద్రమ్మ, సుంకులమ్మ పాల్గొన్నారు.

ఉపాధి హామీలో పండ్ల తోటల సాగుకు అవకాశం



ఆకుమల్లలో ముస్లింల శ్మశాన వాటికను పరిశీలిస్తున్న ఏపీఓ

సంజామల: ఉపాధిహామీ పథకం కింద పండ్ల తోటలు సాగు చేసుకోవచ్చని, రాయితీపై మొక్కలు సైతం అందిస్తామని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ జయంతి అన్నారు. మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామ సచివాలయంలో గురువారం రైతులు, ఉపాధిహామీ కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ.. పండ్లతోటల సాగువైపు రైతులు ఆసక్తి చూపాలని సూచించారు. దీని వల్ల అదనపు ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు. అంతేకాకుండా గ్రామంలో ఏవైన సమస్యలు ఉంటే ఈ పథకం కింద నిధులు మంజూరు చేయించుకుని గ్రామాభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో ముస్లిం శ్మశాన వాటికను పరిశీలించారు. కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ఉపాధిహామీ పథకం కింద నిధులు మంజూరు చేస్తామని తెలిపారు.

బంగారు కుటుంబాలను గుర్తించండి



సమావేశంలో మాట్లాడుతున్న డీడీఓ, కమిషనర్

డోన్ టౌన్: పీ4 పథకం కింద బంగారు కుటుంబాలతో పాటు మార్గదర్శులను గుర్తించాలని డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీడీఓ) నరసింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వార్డు అడ్మిన్‌లతో పీ4 పథకంపై సమీక్షించారు. బంగారు కుటుంబాల కింద అత్యంత పేదలను గుర్తించాలని సూచించారు. వారికి ఆర్థిక సాయం చేసేందుకు మార్గదర్శులను గుర్తించి పేర్లు నమోదు చేయాలని పేర్కొన్నారు.

బలవంతపు భూసేకరణ సరికాదు



కరపత్రాలు విడుదల చేస్తున్న రైతు సంఘం నాయకులు

బనగానపల్లె: సోలార్, గ్రీన్ ఎనర్జీ, సెజ్, జాతీయ రహదారుల పేరుతో రైతుల నుంచి బలవంతపు భూ సేకరణ విధానాన్ని ఆపాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. ఈనెల 20న నంద్యాలలోని నేషనల్ పీజీ కాలేజీ ఆడిటోరియంలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ గురువారం బనగానపల్లెలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల అనుమతి లేకుండా, గ్రామ సభలు ఏర్పాటు చేయకుండా, 2013 భూసేకరణ చట్టం అమలు చేయకుండానే లక్షల ఎకరాల రైతుల భూములను కార్పొరేట్ కంపెనీలకు దారాదత్తం చేయడం సరికాదన్నారు. ఏళ్ల తరబడి పేదల అనుభవంలో ఉన్న భూములకు ఇప్పటికీ పట్టాలు ఇవ్వడం లేదన్నారు. బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా వ్యవసాయ భూములను కాపాడుకునేందుకు రైతు సంఘం రాష్ట్ర సదస్సు ఏర్పాటు చేస్తోందని తెలిపారు. ఈ సదస్సుకు ప్రముఖ న్యాయవాది సుంకర రాజేంద్ర ప్రసాద్‌తో పాటు పలువురు ముఖ్యులు పాల్గొంటారని చెప్పారు. రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు శ్రీనివాసులు యాదవ్, రైతులు నాగార్జున, సుధాకర్, మద్దిలేటి, రామచంద్రుడు, సతీష్, మధు పాల్గొన్నారు.

రహదారికి ఇరువైపులా పెరిగిన కంపచెట్లు



వెంకటగిరి గ్రామం వద్ద రహదారిపైకి వచ్చిన కంపచెట్లు

బేతంచెర్ల: మండల కేంద్రం నుంచి వెల్దుర్తి మార్గంలో రోడ్డుకిరువైపులా కంపచెట్లు పేరుకుపోయాయి. ప్రధానంగా కొలుములపల్లె, ముద్దవరం, వెంకటగిరి, ఎం. పేండేకల్లు గ్రామాల పరిధిలో కంపచెట్లు పెరిగిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపైకి రావడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక.. రోడ్డు సరిపోక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రహదారికి ఇరువైపులా పెరిగిన కంపచెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

రైలు నుంచి పడి యువకుడి దుర్మరణం



బేతంచెర్ల: విశాఖపట్నం వైపు వెళ్లే రైలులో నుంచి యువకుడు జారిపడి మృతి చెందిన ఘటన బేతంచెర్ల–ఆర్‌ఎస్ రంగాపురం రైల్వే స్టేషన్ మధ్య గురువారం చోటుచేసుకుంది. యువకుడి వయస్సు 25 నుంచి 30 ఏళ్ల మధ్య ఉంటుందని.. తెల్ల షర్టు, బ్లాక్ ప్యాంట్, మెడలో పూరిజగన్నాథ్ లాకెట్ ఉందని, ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నామని రైల్వే హెడ్ కానిస్టేబుల్ మధుసుధాకర్ తెలిపారు. ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడి మృతి చెందాడని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పే ర్కొన్నారు. అతని ఆచూకీ తెలిసిన వారు 9849492653 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

తగ్గిపోతున్న విద్యార్థుల సంఖ్య



కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల

కొలిమిగుండ్ల: 1957లో ఏర్పాటైన కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాలలో ఎంతో మంది అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. అలాంటి పాఠశాలలో ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. గత విద్యా సంవత్సరంలో 480 మంది విద్యార్థులు ఉండేవారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆ సంఖ్య 330కి పడిపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉన్నత పాఠశాలను సీబీఎస్‌ఈ పాఠశాలగా ఎంపికైంది. అందుకు తగ్గట్టునే వసతులు ఉండాలనే ఉద్దేశంతో నాడు–నేడు పథకం కింద ఆరు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి ఎక్కువ భాగం కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాలకు వచ్చేవారు. ఈ విద్యా సంవత్సరంలో ఊహించని రీతిలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. అయితే బాలికలు ఎక్కువ భాగం కస్తూర్బా, మోడల్ స్కూల్‌లో హాస్టల్ వసతి ఉండటంతో అక్కడ చేరుతున్నారని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

మురుగు పారదు.. సమస్య తీరదు!



ఆకుమల్ల వెంకటరామిరెడ్డి కాలనీలో రోడ్డుపై మురుగు సమస్యను చూపుతున్న కరీం



ముదిగేడు ప్రధాన రోడ్డుపై మురుగు నిల్వ

సంజామల: గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన రహదారిపై మురుగు నిల్వ చేరిపోవడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. మండలంలోని ఆకుమల్ల, ముదిగేడు గ్రామాలను మురుగు సమస్య వెంటాడుతోంది. మరోవైపు తాగునీటి సమస్య వేధిస్తోంది. ఆకుమల్లలో వెంకటరామిరెడ్డి కాలనీలో రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తోంది. ముదిగేడులో రోడ్డుపై, ఇళ్ల మధ్య మురుగు, వృథానీరు నిల్వ చేరడంతో మురుగుతో సహజీవనం చేస్తున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. కోవెలకుంట్ల–అవుకు ప్రధాన రహదారిపై మురుగు పేరుకుపోయింది. గ్రామస్తులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసికెళ్లిన ఫలితం లేకపోయిందని వాపోతున్నారు.